# అనూహ్యం

రచన:
శ్రీ అడపా రామకృష్ణ.

బాబూ!!

మట్టిరోడ్డుమీద మెల్లగా నడుస్తున్న హరిప్రసాద్ కు ఈ పిలుపుతో కాళ్ళకు సంకెళ్ళు పడ్డాయి.

అదికూడ అపరిచితుడి గొంతుక. హరిప్రసాద్ కు ఆశ్చర్యమేసింది. ఈ తెలియని పల్లెటూరిలో తన్నింతగా పిలిచేవారెవరు. ఎవరైతేనేమి?

అదే పిలుపు మరోసారి వినపడగానే వెనక్కి తిరిగాడు.

ఎదురుగా ఊత కర్ర పట్టుకొని ఓవృద్ధుడు నిలిచియున్నాడు.

బక్క పల్చగా ముడతలు పడ్డ శరీరంతో మూలుగుతూ చేతిలో నున్న ఉత్తరాన్ని అందిస్తూ, బాబూ! ఈ ఉత్తరం ముక్క సదివిపెట్టు నాయినా, మా పెద్దోడికాడి నుంచి వచ్చినట్టుంది. అంటూ చేతి కందించాడు.

హరిప్రసాద్ కార్డును చేతిలోకి తీసుకున్నాడు. ఉత్తరాన్నంతటిని ఒక్క క్షణం పరికించి చూచాడు. అంతా అల్లిబిల్లిగా చిందరవందరగా వ్రాసినట్లుంది. చదవటానికి వీలుగా వ్రాయలేదు.

వృద్ధుడికి చికాకు వేసింది.

ఏటి బాబు అలా నూత్తూ వల్లునున్నావ్, కాసింత గట్టిగా సదువు నాయనా! వృద్ధుడిలో క్షణక్షణానికి ఆతృత కనిపిస్తుంది. రెండు కళ్ళను వెయ్యి కళ్ళుగా చేసుకొని ఉత్తరం వైపే దీక్షగా చూస్తూ నిలుచున్నాడు.

హరిప్రసాద్ మానాన్ని చూచి మరో మారు హెచ్చరించాడు.

హరిప్రసాద్ ఆ ఉత్తరాని కుపక్రమించాడు.

నాన్నా,---

ఈ ఉత్తరం కోసం నీవెంత ఆతృతతో యెదురు చూస్తుంటావో! అందిన వెంటనే సారాంశం తెలియకుండానే ఆనందిస్తావు. అది మీ ఆత్మ సంతృప్తి. కాని మీరు తెల్సుకుంటున్నది ఆనందం కాదు. విషాద నేను దురదృష్ట జాతకుడ్ని నాన్నా. నాకీ జీవితంలో చీకటే మిగిలింది. నా పాడు బ్రతుక్కి యేదయితే మూలాధారంగా వున్నదో అది యిప్పుడు నానుండి దూరంగా పోయింది. నాపై ఆధారపడ్డ మిమ్మల్ని, నన్ను నే నాదరించుకోలేని దుస్థితి ఏర్పడింది. నా ఉద్యోగం పోయింది నాన్నా. ఆఫీసు కాగితాలతో నిండిన ఒక పార్శిల్, పోస్టల్ పుస్తకంతో సహా నా దగ్గరనుండి పోయాయి. దానివల్ల ఆఫీసు ఎంతో నష్టపడింది. ఆ నష్టపరిహారంగా నన్ను గెంటివేసారు. నా కోసం మీరు......

హరిప్రసాద్ యిక చదవలేకపోయాడు. చేతులు గజగజ వణికాయి. భయంతో, బాధతో హృదయం కంపించసాగింది.

ఎదురుగానున్న వృద్ధుడు నేలపై పడివున్నాడు. ఆ మనిషిలో చైతన్యం లేదు. శ్వాస మాత్రం జరుగుతోంది.

ఈ హృదయవిదాకర దృశ్యాన్ని చూడలేకపోయాడు హరిప్రసాద్. ఒక్క క్షణంకూడ అక్కడ నిలువలేక పోయాడు. ముందుకు సాగాడు. కాని ఆలోచనలన్నీ వెనుకనుండి తరుమసాగాయి. ముందుకు సాగుతున్నకొలది మరచిపోయిన జ్ఞాపకాలన్నీ ముంచుకు రాసాగాయి. గతంలో జరిగిన చర్యలకు యిప్పుడు తన కళ్ళముందు ప్రతీకారం జరుగుతోంది. పాత జ్ఞాపకాలకు గతంలోకి పరుగుతీసింది ఆలోచనాస్రవంతి.

× × ×

ఈ వూరు రాక ముందు రోజు. పరీక్షలన్నీ ఆ రోజుతో అయిపోయాయి. సాయంసమయం, పరీక్ష పేపరు గూర్చి నేను లక్ష్మణ్ మాట్లాడుకుంటూ వస్తున్నాం, మిగతా రోజుల్లో కూడా మేమిద్దరం యెప్పుడూ యేదో విషయంగూర్చి చర్చించుకొంటుంటాం. ఏ పనైనా ఇద్దరం కలసికట్టుగా చేస్తుంటాం. అలా చేస్తేనే కాని ఆనందం లేదు, కలసి వుంటేనే కాని హాయిలేదు, మనసులకు శాంతిలేదు. మరి యేనాటి బంధమో అంతటి సన్నిహిత సంబంధము.

ప్రతిదినం చూస్తున్నగనే ఆ రోజుకూడ పోస్టుమాన్ మాకు కన్పించాడు. ఆ పోస్టుమాన్ యెప్పుడూ యేవో పుస్తకాల్లాంటివి, ప్యాక్ చేసేవిగాని సైకిల్ మీద పెట్టి తెస్తుంటాడు. అతడు కనిపించగానే మాకెప్పుడూ లెక్కలేనన్ని దురాలోచనలు చుట్టుముట్టుతుంటాయి. ఆ పుస్తకాలేమిటో! ఆ కవర్సులో ఏమున్నాయో! ఇవే ఆలోచించేవాళ్ళం.

మా ఆలోచనలన్నీ పూర్తయ్యేటప్పటికి అతడవన్నీ పంచిపెట్టి వెళ్ళిపోతుండేవాడు.

కాని — ఆ రోజు ఆలోచనలకు తావివ్వలేదు.

కొద్దిదూరంలో సైకిలునిలిపి మేడపైకి వెళ్లాడు పోస్టు మాన్.

అనుక్షణం మా చూపులు అతన్నే చుట్టు ముట్టుతున్నాయి.

అదను దొరికిందని ఒకరి ముఖాలొకరం చూచుకొన్నాం.

సైకిల్ క్యారియర్ పై ఒక పార్శిల్, ఒక పుస్తకం వున్నాయి.

ఆ రెండూ మా కళ్ళకు బాగా ఆకర్షించాయి.

ఏదో తెలియని అద్భుతశక్తి మమ్మల్ని ముందుకు తోసింది.

అలాంటి క్షణాలెన్నో వచ్చి అకస్మాత్తుగా అదృశ్యమయ్యాయని మాకు అనుభవం మీద తెలిసిన విషయం.

ఈమారు ఆ విధంగా జరుగకూడదని నిశ్చయించుకొన్నాం.

ఇద్దరం సైకిల్ దగ్గరకు చేరాము. మా చేరువలో ఎవ్వరూ లేరని నిర్ధారణ చేసుకున్నాం.

క్యారియర్ మెల్లిగా యెత్తాను. లక్ష్మణ్ ఆ రెండిటినీ తీశాడు. పుస్తకాన్ని నా చేతి కందించాడు. అనుక్షణమే యిద్దరం పరుగు లంఘించాము.

నఖశిఖ పర్యంతం గజగజలాడింది. అతి వేగంగా పరుగు తీస్తున్నా, ప్రపంచమంతా పచ్చగా కన్పడింది. ప్రతి వ్యక్తి మమ్మల్ని గుచ్చిగుచ్చి చూస్తున్న సి. ఐ. డి. లాగ కనపడసాగారు. కన్నెఱ్ఱజేసి చూస్తున్నట్లనిపించింది. చెమటలతో నిండిన శరీరంతో ఇళ్ళకు చేరుకొన్నాం.

ఆ రోజు రాత్రంతా యివే ఆలోచనలు. సరిగ్గా నిద్ర పట్టలేదుకూడ.

ఆ మర్నాడిద్దరం కలుసుకొన్నాము. ఆ పార్శిల్ ను, పుస్తకాన్ని చిత్తుకాగితాల క్రింద జనుకట్టి చించి, ఓ మూల పడవేశాము.

ఆ తరువాత నేనీ వూరొచ్చేశాను.

× × ×

ఇంటికి వచ్చి గదిలో కూర్చొని వెక్కి వెక్కి యేడ్వసాగాడు హరిప్రసాద్.

ఆనంద మనుకొని చేసిన తప్పుకు యెంతమంది శిక్షననుభవిస్తున్నారు. చదువు సంధ్యా తెలిసినవారే విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయి — అర్థం లేని బలహీనతకు లొంగిపోయేకంటే పామరులే మేలేమో ననిపిస్తుంది....

ఛ! ఎంతటి అవివేకం, ఎంత అజ్ఞానం.

ఎప్పుడు వచ్చిందో చీకటిలాంటి నిద్ర ఆవరించింది.

నిద్ర లేచేటప్పటికి సాయంసమయం కావచ్చింది.

పాపభూయిష్ట మయిన ప్రపంచాన్ని చూడలేక సూర్యుడు పశ్చిమాద్రిలో దాగుంటున్నాడు.

మా తాతయ్య అప్పుడే యింట్లోకొస్తూ — 'పాపం - యెవరో ముసలివాడు హృద్రోగంతో చనిపోయాడు.' అన్నారు.

హరిప్రసాద్ గుండెల్లో తీవ్ర సంచలనం రేగింది

ఆ తాతను చంపిన హంతకుడివి —

హంతకుడివి నువ్వే! నువ్వే! — అంటూ అంతరాత్మ వేధించసాగింది.

అయినా ఈ నిజాన్ని గ్రహించేవారెవరు?




Manufacturing ¾ H.P. 20 H.P, —3 Phase RPM Motors 960, 1450 & 2890 Monoblock set 2 H.P. to 20 H.P.3 Phase ½ H.P. to 2 H.P

*Dealers in Madras City:* —UNITED AGENCIES 96, Arminian Street, Madras-1.

POPULAR ELECTRICALS, 329, Thambu Chetty St, Madras-1

Sole Agents for Eastwhile Hyderabad & Maharashtra State, M/s. Vijai, Agencies 24, Market Road, Secundarabad-3.

*Agents for Cuddappah Dt:*—

M/S. V. S REDDY & CO., 4/192, Dr. Ayyaswami Pillai St, Cuddapah (A.P.)